ఎస్సీ వర్గీకరణపై హర్షం

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు, 2: ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం బేడ, బుడగ జంగం కుల సంఘం నాయకులు నిర్మల్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగం జిల్లా ఉపాధ్యక్షుడు గంధం గంగాధర్, టేకులపల్లి దరువు భోజన్న, మిర్యాల ధర్మపురి, గంధం గంగాధర్, గంధం లక్ష్మణ్, మర్యాల పండరి, పీ. రాజు, జీ.శివ, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద సంబురాలు నిర్వహిస్తున్న బేడ, బుడగ జంగం నాయకులు

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

తాంసి(భీంపూర్), ఆగస్టు 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో భీంపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల ప్రధాన సమస్యలు వివరించారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి బాధ్యతగా పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాడాలని కేటీఆర్ సూచించారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య వివరించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు జీ నరేందర్ యాదవ్, బీ కపిల్ యాదవ్, మేకల నాగయ్య, గోప మహేందర్, ఏల్పుల నవీన్, నితిన్, బక్కి కిశోర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన భీంపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు

డయల్-100 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి

● బాధితులకు సాయం చేయడంలో జాప్యం చేయద్దు ● ఎస్పీ గౌష్ ఆలం ఆదేశం

ఎదులాపురం, ఆగస్టు 2: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో డయల్ 100 సేవలు కీలకమని, కాల్ రాగానే స్పందించాలని పోలీసులను ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో సమావేశ మందిరంలో జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల అధికారులు సర్కిల్ అధికారులు డీఎస్పీలు, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందికి డయల్ 100 ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలు, విధులు, పాటించాల్సిన నిబంధనలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. డయల్ 100 కాల్ వచ్చిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. రాత్రి పూట ముఖ్యంగా పట్టణాల ప్రాంతాల్లో గస్తీలు నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ మొబైల్ ద్వారా, ట్యాబ్లెట్ ద్వారా, లేదా సెట్ ద్వారా కమ్యూనికేషన్ సమాచారాన్ని సంబంధిత సిబ్బందికి చేరవేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బీ సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, పట్టణ సీఐలు ఫణిందర్, సీహెచ్ కరుణాకర్‌రావు, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

రిమ్స్‌లో రూ.25లక్షలతో వైద్య పరికరాలు ప్రారంభం

ఎదులాపురం,ఆగస్టు 2: కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా జీఆర్ ఇన్‌ఫ్రా సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అందించిన రూ.25లక్షల విలువైన ఆపరేషన్ థియేటర్ పరికరాలను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో శుక్రవారం డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్‌తో కలిసి కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ముందుగా పరికరాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్‌లో భాగంగానే వివిధ రకాల శస్త్ర చికిత్సల కోసం అత్యాధునిక యంత్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని వసతులను సీఎస్ఆర్ ద్వారా సమకూరుస్తామని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు రిమ్స్ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం బదిలీపై వచ్చిన స్టాఫ్‌నర్సులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ సీ సరోజ, డాక్టర్లు శిరీష్, కల్యాం వెంకట్‌రెడ్డి, సందీప్‌జాదవ్, హెడ్‌నర్సులు, నర్సులు, ఓటీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎడిట్ ఆప్షన్ ఎప్పుడు?

● ప్రజాపాలన దరఖాస్తు వివరాల్లో తప్పులుగా నమోదు ● గృహజ్యోతి అర్హుల తిప్పలు ● ఐదు నెలల నుంచి ఎదురుచూపులు

ఆదిలాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో అర్హులు ఈ పథకానికి దూరమవుతున్నారు. తెల్లరేషన్‌కార్డు ఉండి, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న పేదలకు ఈ పథకం అందడం లేదు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతున్నది. మీరు సరిగ్గా దరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్‌లో వివరాలు లేవని ఎడిట్ ఆప్షన్ లేకుంటే తామేమీ చేయలేమని అధికారులు అంటున్నారు. వేలాది రూపాయల కరెంటు బిల్లులు కడుతూ పేదలు నష్టపోతున్నారు.

తప్పులు ఇలా..

తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలు 200 యూనిట్ల లోపు కరెంటు వినియోగిస్తే జీరో బిల్లు వచ్చేలా ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నది. ప్రజాపాలనలో భాగంగా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలోని 17 మండలాలతోపాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డులకు సంబంధించిన దరఖాస్తులను వివరాల నమోదులో తప్పిదాల ఫలితంగా అర్హులకు జీరో బిల్లులు రావడం లేదు. గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న చేసుకోనట్లు, మీటర్ల నంబర్లు, యూఎస్ఈ నంబర్లు, ఇతర వివరాల నమోదులో తప్పిదాలు చోటు చేసుకున్నాయి.

ఎడిట్ ఆప్షన్ ఎప్పుడో..

ఈ పథకం ప్రారంభంలో సగం మంది దరఖాస్తుదారులకు జీరో బిల్లులు రాకపోవడంతో ప్రభుత్వం మండల కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రేషన్, ఆధార్ కార్డు, కరెంటు బిల్లులతో వచ్చి దరఖాస్తుదారులు తమ వివరాలు అందజేసి సమస్యను పరిష్కరించుకున్నారు. నాట్ అప్లయిడ్, ఇతర తప్పిదాలను సవరించుకునేందుకు ఎడిట్ అప్షన్ లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఎడిట్ ఆప్షన్ ఎప్పుడు వస్తుందా అంటూ సేవా కేంద్రాల సిబ్బందిని అడుగుతున్నారు. తామేమీ చేయలేమని వారు సమాధానం ఇస్తుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

వేల రూపాయల బిల్లులు

జీరో బిల్లు వస్తుందనే నమ్మకంతో విద్యుత్ వినియోగదారులు నాలుగు నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదు. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో జీరో బిల్లులు రాక వేల రూపాయల బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో విద్యుత్ కనెక్షన్ తొలగిస్తారనే భయంతో ప్రజలు భారీగా బిల్లులు చెల్లిస్తున్నారు. ఇదే అవకాశంగా భావించిన విద్యుత్ శాఖ సిబ్బంది కౌంటర్‌లలో బకాయిల ఫైన్ రూపంలో ఒక్కొక్కరికి రూ.75 అదనంగా వసూలు చేస్తున్నారు.

ఆదిలాబాద్ మున్సిపాలిటీ ప్రజాపాలన సహాయ కేంద్రం వద్ద దరఖాస్తుదారులు

జీరో బిల్లు వస్తలేదు..

నేను కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతా. అద్దె ఇంట్లో ఉంటున్నా. ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నా. నాకు జీరో బిల్లు రావడం లేదు. మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చి అడిగితే నాట్ అప్లయిడ్ అని వస్తుందని సిబ్బంది చెబుతున్నాను. ఇప్పటికే మూడుసార్లు వచ్చి సిబ్బందిని కలిశా. ఎప్పుడూ వచ్చినా వారు ఎడిట్ ఆప్షన్ లేదని, వారం రోజుల తర్వాత రమ్మని చెబుతున్నారు. రోజువారి పని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే మా లాంటి పేదలకు జీరో బిల్లులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- రవి, శాంతినగర్, ఆదిలాబాద్

ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలి

కేంద్రమంత్రి రామ్మోహన్‌కు ఎంపీ జీ నగేశ్ వినతి

ఎదులాపురం, ఆగస్టు 2 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ. జీ నగేశ్ కోరారు. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన మంత్రి ఆదిలాబాద్ కేంద్రాన్ని సందర్శించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూర్చి ఇస్తే తప్పకుండా ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే 1592 ఎకరాల భూమిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారని గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సుముఖంగా ఉందని ఎంపీ వివరించారు.

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి విన్నవిస్తున్న ఎంపీ జీ నగేశ్

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

● వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి ● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఆగస్టు 2 : తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, వారోత్సవాలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో తల్లి పాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అంతరాలను తొలగించి తల్లి ప్రాముఖ్యతను చాటుదాం అనే థీమ్ తో ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సబ్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ రాజ్, డీఆర్డీఏ, మెప్మా, ఆరోగ్యశాఖల సిబ్బంది, పత్రిక, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రసవాలన్నీ దవాఖానల్లోనే జరిగేలా చూడాలన్నారు. పుట్టిన గంటలోపు శిశువులకు చాలా ముర్రుపాలు పట్టించే విధానం చాలా తక్కువ శాతం ఉందని, దీనిపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, వృద్ధులు, కుటుంబ సభ్యులందరికీ అవగాహన కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. 7 నెలల నుంచి రెండేళ్ల పిల్లలకు అందించే బాలామృతం, బాలామృతం ప్లస్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవియా, జిల్లా శిశు సంక్షేమాధికారి బీ.సబితా, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఏసీడీపీవో మిల్కా, సీడీపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

'స్వచ్ఛదనం-పచ్చదనం' నిర్వహణపై సమీక్ష

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనంపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ప్రతిరోజూ చేపట్టి, ఇండ్ల ఆవరణ, పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను విజయవంతం చేయాలి

● విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ● అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 1 : ఈ నెల 5 నుంచి 9వతేదీ వరకు నిర్వహించనున్న ప్రభుత్వం చేపట్టనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేసే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజు వారీగా ప్రణాళికలను రూపొందించుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం వంటి విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, సీపీవో బాబురావ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తాంసి, ఆగస్టు 2 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ అసీబ్ ఉల్లా అన్నారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరానికి గురైనప్పుడు వెంటనే 1930 నంబర్ లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆడ పిల్లలను ఆకతాయిలు వేధిస్తే నిర్భయంగా షీ టీమ్ లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివరాం, షీ టీమ్ ఇన్‌చార్జి సుశీల, ప్రిన్సిపాల్ సుదర్శన్, సత్యమోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ అసీబ్ ఉల్లా

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

తాంసి, ఆగస్టు 2 : గ్రామపంచాయతీల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెక్రటేరియట్ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను శుక్రవారం తాంసి ఎస్ఐ శివరాం ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ మండల మాజీ కన్వీనర్, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులు, పలు గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు చెందిన బిల్లులు నేటి వరకు అందలేదని వాపోయారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి మాజీ సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌లు అండె అశోక్, సదానందం, గజానంద్, శ్రీనివాస్, నర్సింగ్, యశ్వంత్ పాల్గొన్నారు.

బోథ్, ఆగస్టు 2 : సెక్రటేరియట్ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారంతో బోథ్ మండలంలో పిప్పల్‌ధరి మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు.

బోథ్ : పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి

తాంసి : మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పాము ఆకారంలో పుట్టగొడుగులు.. భక్తుల పూజలు

నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటి గ్రామంలో హనుమాన్ ఆలయ ఆవరణలో పాము ఆకారంలో ఉన్న పుట్టగొడుగులకు పూజలు చేసిన భక్తులు

నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటి గ్రామంలో శుక్రవారం హనుమాన్ ఆలయం ఆవరణలోని వేప చెట్టు కాండం నుంచి నాగు పాము ఆకారపు పుట్టగొడుగులు మొలిచాయి. నాగదేవత మహిమగా భావించి గ్రామస్తులు పూజలు చేశారు. ఈ ఘటనపై నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ యూ శ్రీనివాస్‌ను వివరాలు అడుగగా వీటిని శీలింధ్ర ఫలనంగాలు అంటారని, మొక్కల్లో బెరడు కుళ్లిపోయి వివిధ ఆకారాల్లో పుట్టగొడుగుల్లా పర్వడుతాయని తెలిపారు.

- కుంటాల, ఆగస్టు, 2